
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
బుధవారం 27 నవంబరు 2024



సీసీ కెమెరాల ప్రారంభం

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాష్ డ్రైవింగ్, అనుమానిత వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇదివరకే నేతన్న చౌక్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద, జిల్లా సరిహద్దులు జిల్లెల్ల, గంభీరావుపేట, రుద్రంగి, కొదురుపాకలో కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్సై రామ్మోహన్ ,సిబ్బంది ఉన్నారు.

న్యూస్ బాక్స్

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం మద్దిమల్ల గ్రామానికి చెందిన పొట్ల సుజాతకు మంజూరైన రూ. 60 వేల సీఎం సహాయనిధి చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు మంగళవారం అందజేశారు. నాయకులు నాగరాజు, హరిలాల్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆదాయం రూ. 49.37 లక్షలు

వేములవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఖజానాకు ఒక్క రోజు రూ.49 లక్షల 37 వేల 928 సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం చివరి సోమవారం పలు ఆర్జిత సేవల ద్వారా ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. అత్యధికంగా కోడెమొక్కు ద్వారా రూ. 14.60లక్షలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వరి కొయ్యలు కాల్చొద్దు

కోనరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి కొయ్యలు కాల్చడంతో భూసారం తగ్గుతుందని కోనరావుపేట వ్యవసాయ అధికారి సందీప్ అన్నారు. మండలంలోని కనగర్తిలో వరి కొయ్యలను దగ్ధం చేస్తున్న పొలాన్ని మంగళవారం పరిశీలించారు. భూసారం తగ్గడంతోపాటు పర్యావరణం దెబ్బతింటుందని, పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు.

యాసంగి ప్రణాళిక ఖరారు



- జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు అంచనా
- వరి 1.74 లక్షల ఎకరాలు
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- సమృద్ధిగా జలాలు
- నవంబరు వరకు 966.4 మిల్లీమీటర్ల వర్షం నమోదు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

యాసంగి పంటల సాగుకు వ్యవసాయ శాఖ అధికారులు యాక్షన్ ప్లాన్ ఖరారు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు ప్రాజెక్టుల్లో సాగు నీరు సమృద్ధిగా ఉండడంతో దానికి అనుగుణంగానే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. జిల్లాలో 1.77 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని అంచనాలు వేశారు. ఇందులో వరి 1,74,311 ఎకరాల్లో సాగు చేస్తారని, అంచనా. మొక్క జొన్న 1431 ఎకరాలు, నువ్వులు 362 ఎకరాలు, పొద్దుతిరుగుడు 810 ఎకరాలు, శనగలు 178 ఎకరాలు, ఇతర పంటలు 317 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. వరి విత్తనాలు అవసరమవగా 18,500 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయి. మొక్కజొన్నకు 115 క్వింటాళ్లకు 15 క్వింటాళ్ల, నువ్వులు 6 క్వింటాళ్లకు 2 క్వింటాళ్ల, శనగలు 18 క్వింటాళ్లకు 10 క్వింటాళ్ల, ఇతర పంటలకు సంబంధించి 10 క్వింటాళ్ల 7 క్వింటాళ్ల సిద్ధంగా ఉన్నాయి.

42,733 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాలో యాసంగి సాగుకు సంబంధించి 1.74 లక్షల ఎకరాల్లో వేసే పంటలకు ఎరువులు 42,733 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనాలు వేశారు. ఇందులో యూరియా 21,811 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3359 మెట్రిక్ టన్నులు, ఎంపీకేఎస్ 11,516 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4607 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1440 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. వ్యవసాయ అధికారులు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను కూడా సిద్ధం చేస్తున్నారు. ఈసారి వ్యవసాయ శాఖ యాక్షన్ ప్లాన్‌ను పకడ్బందీగా రూపొందించింది.

యాసంగికి ఢోకా లేదు...

మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో రైతులు యాసంగి సాగుకు ఢోకాలేదనే భరోసాతో ఉన్నారు. వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు కురవక రైతులు ఇబ్బందులు పడ్డారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు భారీగా కురిశాయి. సిరిసిల్ల, వేములవాడ మూల వాగులు ఉధృతంగా

మిగతా 8వ పేజీలో...

29 నుంచి 'రైతు పండుగ'ను నిర్వహించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న రైతు పండుగలను ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝాతో ధాన్యం కొనుగోలు ప్రక్రియతోపాటు చేపట్టే రైతు పండుగపై సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లకు తీసుకోవాల్సిన చర్యల సూచించారు. ఈ నెల 29వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రైతు పండుగలను నిర్వహించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీఎం రజిత, డీసీఎస్‌వో వసంత లక్ష్మీ, డీసీవో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లె, పట్టణాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లె పట్టణ గ్రామాలను మరింత అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రజాపాలన విజయోత్సవల్లో భాగంగా బోయినపల్లి మండలం రామన్నపేటలో ఈజీఎస్ నిధులు ద్వారా పౌల్ట్రీ ఫామ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేస్తామన్నారు. మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయాశీల, ఏవో ప్రణీత, ఏఎంసీ బోయిని ఎల్లేశ్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు వెన్నెల రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేటలో మంగళవారం రాత్రి మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైన సమస్య ఎదురైనప్పుడు 100కు డయల్ చేయాలన్నారు. తెలియని లింక్‌లు పంపిస్తే ఓపెన్ చేయద్దన్నారు. సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 నంబరులో ఫిర్యాదు చేయాలన్నారు. ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, వీపీవో శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అంబేద్కర్‌కు ఘన నివాళి
- హాజరైన నాయకులు

8



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

- మంగళపల్లె చిరకాల వాంఛ నెరవేరింది
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

నియోజకవర్గంలో రూ.13.40 కోట్లతో అభివృద్ధి పనులు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మూడపల్లిలో భూమి పూజ చేస్తున్న ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్/చందుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో రూ.13.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా చందుర్తి మండలం మూడపల్లిలో అభివృద్ధి పనులకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్య తరగతి భావజాలం ఉన్నవారి చేతిలో పదవి ఉంటే మధ్యతరగతి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆనాడు గెలిచిన వారు మన ప్రాంతాన్ని పట్టించుకోలేదన్నారు. వేములవాడ రాజన్న ఆలయ బ్రోచర్‌లో గోవిందరాజుల స్వామి ఆలయన్ని చేర్చామన్నారు. గత ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసినా సంక్షేమం, అభివృద్ధి ఆపడం లేదన్నారు. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ చెల్కల తిరుపతి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ఎంపీడీవో ప్రదీప్‌కుమార్, ఏపీవో రాజయ్య, ఏపీఎం రజిత, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి కృషితో రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం మారుపాకలో రూ.35 లక్షతో కల్వర్టు నిర్మాణానికి మంగళవారం భూమిపూజ నిర్వహిం చారు. ముడికే చంద్రశేఖర్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రుద్రంగి: వేములవాడ నియోజక వర్గంలో అభివృద్ధి పనుల శంకుస్థాపన జాతర జరుగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో రింగ్ రోడ్డు, సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగ ఉపాధి కోసం రుద్రంగికి ఏటీసీ కళాశాలను రూ.42 కోట్లతో మంజూరైందన్నారు. కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెలుకల తిరుపతి, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, తిపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సరెడ్డి, శంకర్, గంగాధర్, అభిలాష్, మహేష్, లింగారెడ్డి, తర్రె లింగం, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కలెక్టర్ రూపంలో కూర్చున్నాడు..

- మాజీ మంత్రి కేటీఆర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'కేసీఆర్ దయతో సిరిసిల్ల ప్రజల కోరికతో రాజన్న సిరిసిల్ల జిల్లా ఏర్పడింది. కలెక్టరేట్ అద్భుతంగా కట్టుకున్నాం. ఒక కాంగ్రెస్ కార్యకర్త కలెక్టర్ రూపంలో వచ్చి కూర్చున్నాడు. మా నాయకులను పార్టీ మారాలని కలెక్టర్ చెబుతున్నాడట' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయంలో నవంబరు 29న చేపట్టే దీక్ష దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఇలాంటి సన్నాసులను కక్షపూరితంగా తీసుకొచ్చి రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఏం పరవాలేదని, బీఆర్ఎస్ కార్యకర్తల వెంట్రుకను ఎవరూ పీకలేరని హెచ్చరించారు. గద్దెనెక్కి కూర్చున్న తరువాత ఎవరైనా ఎన్నీ డైలాగులైనా చెబుతారని, వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ రాజన్న సిరిసిల్ల జిల్లా మొదటి నుంచి ఉద్యమానికి అండగా ఉందన్నారు. ఎవరెన్ని కథలు చెప్పినా కేసీఆర్ త్యాగం, పోరాటాన్ని చిన్నది చేసి చూపించినా రాష్ట్రంలో ప్రజల పోరాటాలు, పిల్లల బలిదానాలు మరువద్దన్నారు. సంవత్సరం కింద కాంగ్రెస్ నాయకులు ఎన్నికథలు చెప్పారో తెలుసన్నారు. జిల్లాలో వేములవాడలో 12వేల ఓట్ల తేడాతో ఓడిపోయామని, కాంగ్రెస్ హామీలతో ప్రజలు మోసపోయారని అన్నారు. సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు, గురుకులాల్లో సంభవించిన 38 మంది విద్యార్థుల మరణాలు, తిరిగి ప్రారంభమైనా రైతన్నల ఆత్మహత్యల సాక్షిగా రాష్ట్రంలో ఎవరూ సంతోషంగా లేరన్నారు. మాట్లాడితే కేసులు పెడుతున్నారని, తనను కూడా ఎట్లా పట్టుకోవాలని ఎట్లా కేసులు పెట్టాలోనని చూస్తున్నారని అన్నారు. పెట్టుకుంటే పెట్టుకోని పర్వాలేదన్నారు. ఎవరి అయ్యకూ కూడా భయపడబోమన్నారు. రేవంత్ రెడ్డి కాదు తాత, జేజమ్మ దిగివచ్చినా జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తల వెంట్రుకలు ఎవరూ పీకలేరన్నారు. జీవితంలో ఎన్నో దెబ్బలు చూశామని, కలెక్టర్, అధికారులు, పోలీసుల డ్రామాలు ఎన్నిరోజులో చూద్దామన్నారు. ఎవరు కాంగ్రెస్ కార్యకర్తల్లాగా ఓవర్ యాక్షన్ చేస్తున్నారో

మిగతా 8వ పేజీలో

పాఠశాలలో మాక్ పోలింగ్

ముస్తాబాద్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని బాలికల సక్సెస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓల్లాద్రి ఎల్లారెడ్డి, పీఈటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ

వేములవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పురపాలక సంఘం పరిధిలో అధికారులు సేకరించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సకుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కొనసాగుతోంది. పురపాలక సంఘం పరిధిలో 15,901 కుటుంబాల వివరాలు సేకరించిన ఎనూమరేటర్లు, ప్రైవేట్ ఆపరేటర్లతో కలిపి మొత్తం 46 మందితో ఆదివారం నుంచి ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. వేములవాడ పురపాలక సంఘం, తిప్పాపూర్ ప్రభుత్వ పాఠశాల, వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మొత్తం 46 మందితో ప్రక్రియ కొనసాగుతోందన్నారు. పది రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసే విధంగా సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులు ఐకమత్యంతో ముందుకుసాగాలి



జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం పాలకవర్గం

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులు ఐకమత్యంతో ముందుకు సాగాలని టీజీవో సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివ నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ గెజిటెడ్ హోదాల్లో పని చేస్తున్న అధికారుల సమస్యలను పరిష్కరించేందకు జిల్లా స్థాయిలో సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

- జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సమరసేన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ జబీ ఉల్లా, అసోసియేటెడ్ అధ్యక్షుడిగా జోగం రాజు, కోశాధికారిగా అబ్దుల్ రసూల్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ అంజిరెడ్డి, అబ్దుల్‌వాజీద్, శరత్‌కుమార్, మల్హోత్రా, జానకి, సహాయ కార్యదర్శులుగా సాయికిరణ్, శ్రీకాంత్, చంద్రకళ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాగర్, ప్రచార కార్యదర్శిగా కిరణ్‌రావు, కార్యాలయ కార్యదర్శిగా వరుణ్, సంస్కృతిక కార్యదర్శిగా వినోద్, క్రీడాశాఖ కార్యదర్శిగా లక్ష్మణ్, సభ్యులుగా శేఖర్, కవిత, భాగ్యలక్ష్మీ, శ్రావ్యను ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకులు శ్యాం, ఉపేందర్‌రెడ్డి, జగన్‌మోహన్, పరమేశ్వర్, శిరీష, సుజాత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రామారావు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ తదిరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పలువురు విద్యావేత్తలు, న్యాయనిపుణులు, వివిధ రంగాల ప్రముఖులతో రాజ్యాంగ నిర్మాణ సభను ఏర్పాటు చేశారని, 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలోని డ్రాఫ్ట్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగం రూపొందిందని పేర్కొ న్నారు. సీపీవో శ్రీనివాసా చారి, డీపీఆర్వో శ్రీధర్, ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జావేద్ అహ్మద్, శ్రీకాంత్, పుష్పలత, షరీఫ్ ఉన్నారు.

సిరిసిల్ల క్రైం: భారత రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా



నివాళులు అర్పిస్తున్న ఎస్పీ

ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా దేశంలోని ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను కల్పించడంతోపాటు ప్రజల ప్రయోజనాలు లక్ష్యంగా చట్టాలను సైతం పొందుపరిచారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తూ సమాజాభివృద్ధిలో భాగ స్వామ్యం కావాలన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీ కృష్ణ, ఆర్ఐలు మధుకర్, రమేశ్, సీఐలు శ్రీనివాస్, శ్రీలత, ఎస్సైలు కిరణ్, ఆర్ఎస్ఐ శ్రవణ్, శ్రీనివాస్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ దుద్దెడ నరేందర్(34) దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేటకు చెందిన నరేందర్ కరీంనగర్ భగత్‌నగర్‌లో అద్దె ఇంటిలో భార్యపిల్లలతో నివాసం ఉంటున్నాడు. నరేందర్ రాత్రి 11 గంటల సమయంలో కరీంనగర్ నుంచి నగనూర్‌కు ఫుడ్ తీసుకువెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో నరేందర్ బైక్‌పై నుంచి ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురులున్నారు. ఫుడ్ డెలివరీబాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నరేందర్ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి బంధువులు విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన బైక్‌పై ఉన్న వ్యక్తి స్థానిక నగునూర్ వైద్యకళాశాల విద్యార్థి కామినేని యువరాంచందర్‌గా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన ఏఎస్సై మృతి


రామస్వామి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల 17న జరిగిన అగ్నిప్రమాదంలో కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ సీసీ ఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ రామస్వామి మంగళవారం మృతిచెందాడు. కరీంనగర్‌లోని ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో రామస్వామి, అతడి భార్య గాయపడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న రామస్వామిని కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ 9రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామస్వామి కొడుకు కూడా కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రామస్వామి మృతి పట్ల పలువురు పోలీసు అధికారులు సంతాపాన్ని వెలిబుచ్చారు.

దొంగతనం కేసులో

ఇద్దరికి ఎనమిది నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్షతో పాటుగా వంద రూపాలయ జరిమాన విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామంలో మార్చి 3వ తేదిన మల్లికార్జున స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఊరడి రాజిరెడ్డి ఇచ్చిన పిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముప్పల్ మండలంకు చెందిన నాగరాజు, నిజమాబాద్ జిల్లాకు చెందిన సాయుకుమార్‌లు పాల్పడినట్లు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కి తరలించారు. విచారణ అధికారి గోపాల్‌రెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎమ్ఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ అనే న్యాయవాది కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సదరు ఇద్దరు నేరస్తులకు 8 నెలల కారాగార జైలు శిక్షతో పాటు వంద రూపాయాల జరిమానా విదించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామం మీదుగా మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ సంపత్, యజమాని మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.



తీరనున్న కష్టాలు

- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా సాధారణ బోగీలు
- రెండు నుంచి నాలుగు వరకు పెరిగిన బోగీలు
- పలు రైళ్లకు జత చేసిన అధికారులు
- దశల వారీగా అన్ని రైళ్లలో అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశవ్యాప్తంగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఉన్న రెండు సాధారణ బోగీలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. అన్ని రైళ్లలో నాలుగు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు ఆయా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనంగా మరో రెండు బోగీలను అమరుస్తున్నారు. ఈనెల నుంచి పలు రైళ్లలో అదనపు బోగీలను అమర్చడం ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు సుమారు 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనపు బోగీలను అమర్చనున్నారు. దేశంలోని వివిధ రూట్లలో వివిధ రైల్వేలు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లన్నింటికీ రెండు సాధారణ బోగీలు మాత్రమే అమర్చారు. మిగతా బోగీలు త్రీటైర్, టూటైర్, నాన్ ఏసీ బెర్త్‌లను నడిపారు. వీటిలో ప్రయాణించేందుకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు సీట్లు ఖాళీ ఉంటే స్టేషన్లలో టిక్కెట్లు తీసుకుని ప్రయాణించే సౌకర్యం ఉంది. సాధారణ బోగీలు రెండు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు చాలా మంది సీట్లు నిండిన తర్వాత నిల్చుని ప్రయాణిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో సాధారణ ప్రయాణికుల పరిస్థితి మరింత దారుణం. ఎన్నో ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సాధారణ బోగీలను పెంచాలనే డిమాండ్ ఉంది. ఆ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రులు, అధికారుల దృష్టికి వెళ్లడంతో మరో రెండు సాధారణ బోగీలను జత చేసి నడుపుతామని జూన్‌లో ప్రకటించారు. దీంతో ఈనెల నుంచి పలు రైళ్లకు అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చడం ప్రారంభించారు. వచ్చే నెలాఖరు వరకు దశల వారీగా అన్ని రైళ్లకు అదనపు బోగీలను జత చేయనున్నారని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అదనపు సాధారణ బోగీలను జత చేయడం వల్ల వాటిల్లో ప్రయాణం చేసే వలస కార్మికులకు, దినసరి కూలీలకు, విద్యార్థులకు కొంత ఊరట కలగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైస్‌మిల్ పరిశ్రమలు, ఇటుక బట్టీల పరిశ్రమలతోపాటు భవన నిర్మాణ రంగం, హోటళ్లలో పని చేసేందుకు ఉత్తర భారత దేశం నుంచి వేలాది మంది వలస కార్మికులు పనుల కోసం వస్తున్నారు. అదనపు సాధారణ బోగీలను అమర్చడం వల్ల వలస కార్మికులకు ఎంతో మేలు జరగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి జంక్షన్, రామగుండం, జమ్మికుంట రైల్వేస్టేషన్ల నుంచే వలస కార్మికులు, కూలీలు, ఇతరులు ప్రయాణిస్తుంటారు. జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చారు.



- జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్లలో నిలిచే సికింద్రాబాద్ నుంచి దాణాపూర్ పాట్నా నుంచి సికింద్రాబాద్ 12791/92 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆగే 12295/96 శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు నుంచి దాణాపూర్, పాట్నా నుంచి శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఇప్పుడు ఈ రైలులో నాలుగు సాధారణ బోగీలు ఉన్నాయి. ఇప్పటికే మన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌కి సంబంధించిన దూర ప్రాంత రైళ్లలో మన జోన్‌కు, ఇతర జోన్‌లకు చెందిన రైళ్లలో కొన్నింటిలో అమర్చారు.
- జమ్మికుంట, రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12721/22 నాంపల్లి హైదరాబాదు నుంచి ఢిల్లీ నిజాముద్దీన్, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదు దక్షిణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిచే 12625/26 తిరువనంతపురం నుంచి కొత్త ఢిల్లీ, అక్కడి నుంచి తిరువనంతపురం కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12615/16 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (జీటీ) గ్రాండ్ ట్రంక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జతచేసి నడుపుతున్నారు.
- సాధారణ బోగీలు లేని ఆంధ్రప్రదేశ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 20805/06 విశాఖపట్నం నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి విశాఖపట్నం నడిచే రైలులో నాలుగు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉంది.
- ఇప్పటికే పెద్దపల్లి, రామగుండంలో నిలిచే 22152/51 పూణె నుంచి కాజీపేట, కాజీపేట నుంచి పూణె వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12511/12 రప్తిసాగర్ ట్రైవీక్లీ, కోర్బా బైవీక్లీ, అహిల్యానగరి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12723/24 నాంపల్లి హైదరాబాదు నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదుకు నడిచే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.
- పెద్దపల్లి జంక్షన్‌లో నిలిచే 12656/55 అహ్మదాబాద్ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.

జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన అజ్మీర దేశాయి నాయక్(79) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన దేశాయి నాయక్ సోమవారం అనారోగ్య కారణంతో జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాలికి ముల్లు గుచ్చుకుందని ఆస్పత్రికి తీసుకువస్తే అప్పటి నుంచి ఎలాంటి చికిత్స అందించకపోవడం వల్లనే మృతి చెందాడని, మూడు రోజుల క్రితం వరకు చలాకీగా ఉండి కూలీ పనులు చేసాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందించకపోవడం వల్లనే చనిపోయాడని మృతుడి బంధువుల ఆస్పత్రి వద్ద రోదించారు.

నాంపల్లి గుట్టపైన లీజు హక్కులకు టెండర్

- సరైన వేలం రాకపోవడంతో రద్దు

వేములవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి దేవస్థానములోని పలు లీజు హక్కులకు బుధవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో బహిరంగ వేలము, పేపర్ టెండర్, ఆన్‌లైన్ టెండర్స్ నిర్వహించారు. ప్రమిదలు చమురుతో వున్న వత్తులు అమ్ముకొను హక్కును రెండు సంవత్సరాలకు గాను వేములవాడకు చెందిన బిక్షపతి రూ. 50 లక్షల 55 వేల 555కు దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, పూజ సామాగ్రి అమ్ముకొను హక్కులను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ అనే వ్యక్తి రూ. 55 లక్షల 55 వేల 999లకు, పప్పు బెల్లం, బొమ్మలు ఆటవస్తువులు అమ్ముకునే లీజును రూ. 10 లక్షల 6 వేల 666కు దాచారం గ్రామానికి చెందిన పర్శరాములకు దక్కగా, కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకునే లీజును జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ. 21 లక్ష 55 వేల 999లకు దక్కించుకున్నారు. నాగఫణీ వద్ద ఇన్ స్టాంట్ ఫోటోలు లీజు హక్కును దాచారంకు చెందిన పర్శరాములు రూ. 24 లక్షల 6 వేల 666 హెచ్చుబిడ్డు ద్వారా టెండర్లను దక్కించుకున్నట్లు ఆఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కాగా గుట్టపైన క్యాంటీన్ నిర్వహణ లీజు హక్కును ఎవరు డిపాజిట్లు చెల్లించలేదని, నూనె గురుగులు, పాలు అమ్ముకును హక్కు అంశములకు సరియగు వేలం పాట రానందున ఇట్టి రెండు టెండర్స్ వాయిదా వేసినట్లు తెలిపారు.

టెండర్ నిర్వహణలో ఆలయ ఈవో, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, దేవాదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖతార్ దేశంలో జగిత్యాల జిల్లా వాసి ఆదృశ్యం?

- ఆరు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ ప్రవాసీ ప్రజావాణిలో భార్య ఫిర్యాదు

గొల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లిన ఓ యువకుడు ఆరు నెలలుగా పత్తా లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తన భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ గల్ఫ్ బాధితుడి భార్య రాసూరి సునీత కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో సీనీయర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవ రాజన్‌కు వినతి పత్రం సమర్పించింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన రాసూరి రాజేంధర్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లాడు. అక్కడే పని చేస్తూ ఉన్న క్రమంలో తన ఉద్యోగం పోయిందని, మాల్టా దేశం వెళ్తానని అందుకు రూ. 5 లక్షలు అవసరమవుతాయని, వాటిని తనకు పంపించాలని ఆరు నెలల క్రితం దట్నూర్‌లో ఉన్న తల్లి, భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భార్య సునీత, తల్లి కలిసి బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి రాజేందర్‌కు రూ. 5 లక్షల పంపించారు. డబ్బులు పంపించిన అనంతరం రాజేందర్ ఫోన్ స్విచ్చాఫ్ అయిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆరు నెలలుగా అతడి ఆచూకీ లభించడం లేదని బాధితుడి కుటుంబ సభ్యులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి దర్యాప్తు చేయించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్‌ను ఆదేశించినట్లు బాధితురాలు సునీత తెలిపారు.


ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట తసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న బోజనం సరుకులు ఎలా తెచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్షల కొద్ది అప్పులు తెచ్చి వంట చేస్తుంటే అధికారులు తనిఖీల పేరిట ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు ఆకాశానంటుతున్నాయన్నారు. మెస్ చార్జీలు పెంచక మూడేళ్లు దాటిందని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సరపరా చేయాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు. అంతకుముందు వినతి పత్రాలు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రాజమణి, మహేశ్వరీ, రేఖ, లక్ష్మణ్, వరలక్ష్మి, నిర్మల, బాలవ్వ, జ్యోతి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతికి మంత్రి పరామర్శ


గొట్టె భూపతిని పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత రెండు రోజుల కిందట మరణించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. కరీంనగర్ మంకమ్మతోటలోని నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టెభూపతి, సుధీర్‌బాబులను కలిసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రితో పాటు సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమద్‌నవాబ్, ఎండీ తాజ్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం


లక్ష్మి పార్థివదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్/ కరీంనగర్ రూరల్/కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, రచయిత వీరగోని పెంటయ్య సతీమణి వీరగోని లక్ష్మి(65) పార్థివదేహాన్ని మంగళవారం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈనెల 23న రాత్రి లక్ష్మి గుండెపోటుతో మరణించారు. గత ఏడాది వీరగోని పెంటయ్య, లక్ష్మీ దంపతులు మరణానంతరం దేహదాన అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. వారి కోరిక మేరకు కుమారుడు, కూతురు అమెరికా నుంచి మంగళవారం వచ్చి అంతిమయాత్ర నిర్వహించి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరగోని పెంటయ్య, కుమారులు నరేష్, సురేష్, కుమార్తెలు సమత, సౌజన్య డాక్టర్ బి లచ్చయ్య, రఘుశంకర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, కనకయ్య, రాజేందర్, బుర్ర తిరుపతి, సీవీ కుమార్, డి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీరగోని పెంటయ్య కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పదేళ్లలో చేయని ప్రగతిని ఏడాదిలోనే సాధించాం

- ఎల్‌మడుగు, రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం
- మంథనిలో సిల్క్ డెవలమెంట్ సెంటర్, మహిళ పారిశ్రామిక పార్కు
- మంథని వద్ద గోదావరి నదిపై రూ. 1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- ప్రజాపాలన విజయోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 26: రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేయని అభివృద్ధి పనులను తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సాధించామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవం కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దీవాలా తీసిన ఆర్థిక క్రమశిక్షణతో సీఎం రేవంత్‌రెడ్డి, తమ మంత్రివర్గం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలతో ముందకుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల హామీలో ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన వెంట నే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీపై గ్యాస్ సిలెండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వాటిని త్వరలో అమలు చేయటానికి కృషి చేస్తున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎంఎస్‌పీతో పాటు సన్న వడ్ల రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గింజ తరుగు లేకుండా రైతుల వడ్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే నెలకు 5 వేల ఉద్యోగాల చొప్పున 55 వేల మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పదేళ్లుగా ఆగిపోయిన ఉద్యోగుల బదీలు, పీఈటీలకు ప్రమోషన్లను తమ ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. అనేక పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు స్కిల్స్ డెవలప్ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఏడాదిలో అనేక కార్యక్రమాల అమలుతో మందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇంకా విమర్శించడం ఎందుకని ప్రశ్నించారు. వారికి తమ పని తీరుతోనే జవాబు చెప్తామన్నారు. ఏడాదిలో తమ ప్రభుత్వ సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకోవటానికి ప్రజా విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాను, మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామన్నారు. మంథనిలో, పెద్దపల్లిలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామన్నారు. మంథని గోదావరినదిపై రూ.1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మించి వ్యాపారపరంగా అభివృద్ధి చేస్తామన్నారు. కూచిరాజ్‌పల్లి, బోయినిపేటల మీదుగా బైపాస్ రోడ్డును నిర్మిస్తామన్నారు. మంథనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి మహిళలకు ఉపాధి అవకాలు కల్పిస్తామన్నారు. గోదావరినదిలోని ఎల్.మడుగు ఇరువైపులా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు రూ.7కోట్లతో ఖానాపూర్ పిడబ్ల్యూడీ రోడ్ నుంచి ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాన చేశామన్నారు. రామగిరి ఖిల్లాను సైతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా సొంత భవనాలు లేని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు, మున్సిపల్, పీఏసీఎస్ ఛైర్మన్లు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

చికిత్స పొందుతూ గిరిజన బాలిక మృతి


రక్షిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): చిన్న విషయానికి మానసిక ఆందోళనకు గురై ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిరిజన బాలిక మాలోతు రక్షిత(17) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని దేవునిగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంటతండాకు చెందిన మాలోతు మంజుల-తిరుపతి దంపతులకు ఇద్దరు పిల్లలు రక్షిత, రాహుల్ ఉన్నారు. తిరుపతి 14 ఏళ్ల కిందట భార్యాపిల్లలను వదిలి వెళ్లిపోయాడు. దాంతో మంజుల కూతురు రక్షిత, రాహుల్‌ను తీసుకుని 10 ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట గ్రామానికి చేరుకుంది. ఓ గదిని అద్దెకు తీసుకుని బట్టల దుకాణంతో పాటు కుట్లు, అల్లికలతో ఉపాధి పొందుతూ పిల్లలను సాకుతోంది. కూతురు రక్షిత దుమాల ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ చదివి గత యేడాది అనుత్తీర్ణురాలైంది. దాంతో అప్పటి నుంచి తల్లికి చేదోడువాదోడుగా ఉంటోంది. మానసిక స్థితి సరిగా లేక ఆందోళనకు లోనైన ఆమె ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు రక్షితను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే

● శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్



యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ దంపతులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే అని శాతవాహన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎత్నిక్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ ఉమేష్ కుమార్ సతీసమేతంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం వల్ల యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అంతకముందు విద్యార్థులు బోనాలు, పల్లకితో అమ్మవారిని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉగాది, దీపావళి, సంక్రాంతి, కృష్ణాష్టమి, క్రిస్మస్, వినాయక చవితి, బోనాలు, బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించారు. ఉప కులపతిచే ఉట్టి కొట్టించి, జమ్మి పూజ చేసి రావణ దహనం చేయించారు. అనంతరం వీసీ దంపతులు బతుకమ్మ ఆడారు. విద్యార్థులు, అధ్యాపకులు అన్ని పండుగలకు సంబంధించిన 200 రకాల పిండి పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ మనోజ్, డాక్టర్ నరేష్, డాక్టర్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



వసంత్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మహారాష్ట్రలోని పూణే పట్టణంలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న 27వ జాతీయస్థాయి కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా జిల్లాకు చెందిన కే వసంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ ఎస్ శ్రీనివాసన్ నుంచి ఆదేశాలు అందుకున్నట్లు వసంత్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన నాంపల్లి (49) అనే వ్యక్తి నల్లగొండ గుట్ట ప్రాంతానికి సోమవారం అడవి పందుల వేట కోసం వెళ్లినట్లు సమాచారం. నాంపల్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గుట్ట శివారు ప్రాంతంలో గాలింపు చేపట్టారు. నాంపల్లి విద్యుదాఘాతానికి గురై కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మోతీలాల్ తెలిపారు.

కోనోకార్పస్‌తో ముప్పు..!



హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మొక్కలు తొలగించాలని కోరుతున్న ప్రజలు
- ప్రజాప్రతినిధులు స్పందించాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి, పట్టణాల్లోని డివైడర్ల మధ్య సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హాని ఇవి హానికరమని అంటున్నారు. ఈ చెట్ల మీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంతో హానికరమో ఇట్టే అర్థమవుతుంది. హుజూరాబాద్ నుంచి శాలపల్లి-ఇందిరానగర్ గ్రామం వరకు ఇటు హుజూరాబాద్ నుంచి బోర్నపల్లి వరకు, కొత్తపల్లి వరకు ప్రధాన రహదారుల మధ్య కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి.

● **అవెన్యూ ప్లాంటేషన్.., రహదారుల పక్కన**

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం-పరిశుభ్రత, హరితహారం కార్యక్ర మంలో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ. 50లు వెచ్చించి కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగ నివ్వకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. అలాగే ప్రకృతి వనంలో, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహ దారుల పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

● **చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ..**

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రమే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డు వచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణానికి హాని కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు లేదా పండ్ల మొక్కలు నాటాలి.

- వేల్పుల ప్రభాకర్, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర ఉపయోగపడే మొక్కలు నాటాలి.

-బింగి కరుణాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి, రంగాపూర్.

జాతీయ స్థాయి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి



హోమ్ రాజ్

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 30వ తేదీ వరకు జరగబోయే అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి కె. హోమ్‌రాజ్ ఎంపికయ్యాడు. కాగా హోమ్‌రాజ్‌ను స్కూల్ డైరెక్టర్ కర్నల్ కేసి రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- నాలుగు రోజుల క్రితం మృతి
- పంచనామా చేసిన అధికారులు

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీనివాస్ (40) అనే యువకుడి మృతిపై అనుమానాలు తలెత్తడంతో అధికారులు పంచనామా నిర్వహించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు సాధరణ మృతి అని చెప్పి అంత్యక్రియలు నిర్వహించారు. తన తమ్ముడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, అక్క విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ఫాతిమా మంగళవారం ఒగులాపూర్ గ్రామానికి చేరుకొని ఎముకలు, బూడిదను ఫోర్సెనిక్ ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

గుంతలో పడి వాహనదారుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి గుంతలో పడి బొప్పాపూర్‌కు చెందిన వాహనదారుడు బిస్క సత్యం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వాహనం గుంతలో పడి అదుపు తప్పింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ



కార్మిక దంపతులు, చిన్నారికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి సురేఖ

● మంత్రి కొండా సురేఖ

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఆలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వాటిపై సర్వే నంబర్‌ల వారిగా విచారణ చేపడుతుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని 50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అంతుకు ముందు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు రంగాపూర్ గ్రామం నుంచి మంత్రి, ఎమ్మెల్యేను ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలుకగా ఆలయ సమీపంలో మంత్రిని ఎడ్లబండి ఎక్కించి ఆలయం వరకు మహిళలు కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన యాదాద్రిని నిర్మించినా భక్తులకు ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో భక్తులకు తాగునీరు, వసతులు కల్పించామన్నారు. అలాగే యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తోడుగును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యదాద్రి వద్ద వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం, బ్యాటరీ కార్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే వేములవాడ ఆలయాన్ని సైతం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారంతో ఆలయానికి ఉపయోగపడే ఆభరణాలు, అలంకరణ వస్తువులు తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఆలయంలో ఉన్న బంగారం, వెండిని లెక్కించి వాటితో వెండి పల్లకీలను తయారుచేయించి నూతనుత్తేజం ఉండేవిధంగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని త్వరలోనే అధికారులతో సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎండోమెంట్ పరిధిలోని ప్రతి ఆలయానికి టీటీడీ నుంచి వచ్చే నిధులు రాకుండా చేసిందని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి సబ్బితం ఆలయం అనుసంధానం చేయనున్నట్లు, ప్రతినెల నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు రానున్నట్లు తెలిపారు. గ్రామస్థులు సైతం ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కలబోయిన మహేందర్, చంద శంకర్, చుంచు సదయ్య పాల్గొన్నారు.

కార్మిక దంపతులను చూసి చలించి..

- దుస్తులు, చెప్పులు కొనిచ్చిన మంత్రి

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ వెళ్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో పూసాల చౌరస్తా సమీపంలో తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారిని గమనించారు. కారు ఆపి దిగి ఆమె వద్దకు వెళ్లారు. చెప్పులు లేకుండా చిన్నారిని రోడ్డుపై నడిపిస్తున్న ఒడిశా కార్మిక దంపతుల మందలించారు. వారిని తనతో పాటు ఓ చెప్పుల షాపులోకి తీసుకువెళ్లి ముగ్గురికి చెప్పులు కొనిచ్చారు. ఆ తర్వాత బట్టల షాపులోకి తీసుకవెళ్లి దుస్తులు కొనిచ్చారు. మంత్రి ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

జస్టిస్ స్వామినాథన్ కమిషన్
సిఫార్సులను అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అభివృద్ధి కోసం జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీ యూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ చెప్పిన విధంగా పంట దిగుబడి అయ్యే వరకు ఎంత ఖర్చు అయ్యిందో దానికి అదనంగా 50 శాతం ధరను పెంచి పంటలకు రేటు నిర్ణయించాలని, కానీ అమలు కావడం లేదని అన్నారు. దీనికి తోడు రైతు దేశంలో ఎక్కడైనా పంటను అమ్ముకోవచ్చని చెప్పినా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేక దళారుల రాజ్యంగా మారిపోయిందన్నారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ శక్తులకు, ఎఫ్‌డీఐలకు అనుకూలంగా మార్చిందని, 8 గంటల పని విధానానికి బదులు 12 గంటల పని భారాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సింగరేణి, రైల్వేలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్య, వైద్యం, కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్తున్నాయని, దానిని నిరోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేవీ అనసూయ, పోచయ్య, మల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, మారుతి, నర్సింగోజి, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సోమిశెట్టి దశరథం, గుజ్జె దేవదాస్ ఉన్నారు.

40 ఏళ్ల ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత



నేలకూలిన ట్యాంకు

గంగాధర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 40 సంవత్సరాలుగా గ్రామస్థులకు తాగు నీరందించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరగా అధికారులు మంగళవారం కూల్చి వేశారు. గంగాధర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి ఎదురుగా 40 ఏళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకు పక్కన గ్రంథాలయం, ప్రజల ఇళ్లు ఉండగా అధికారులు కూల్చడంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోకుండా సురక్షితంగా ట్యాంకును కూల్చి వేశారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

- ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ
- వేములవాడలో బద్దిపోచమ్మకు బోనం
- కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భక్తులతో కిక్కిరిసిపోయిన బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగాణం

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తులరద్దీ మంగళవారం పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజ లు, కుంకుమార్చన, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, అర్చకులు, నిత్యపూజలు, అభిషేకాది కార్యక్ర మాలు నిర్వహించారు.

25 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 25వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలుచేసి నదీ మాత కు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేములవాడ కల్చరల్ : వేములవాడ బద్దిపోచమ్మ అమ్మ వారికి భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమ వారం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి దర్శనానికి బారు లుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సుమారు నాలుగు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో వేచి చూశా రు. అనంతరం పట్నాలువేసి ఒడిబియ్యం సమర్పించారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొన సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కొనసా గుతోంది. కార్యక్రమాన్ని ఆలయాధికారులు మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. వేకువ జాము నుంచే వందలాది వాహనాలు, కాలిన డకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు ఆలయం ముందుగల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీకపూజలు చేశారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో నెల రోజులుగా నిర్వహి స్తున్న సామూహిక కార్తిక దీపోత్సవంను మంగళవారం పర్య వేక్షకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

న్యూస్ బాక్స్

ఉపాధి పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండలంలోని అనంతారం గ్రామంలో మంగళవారం ఉపాధిహామీ పనులు ప్రారంభించారు. ఉపాధిహామీ పనులలో భాగంగా పశువులపాక, అజోలాగడ్డి పెంపకం పనులు ప్రారంభించారు. ఎంపీడీవో శశికళ, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు రాజేశం, రజనీకాంత్, ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని కేరళ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మాలల సింహగర్జన పోస్టర్‌ను మాలమహానాడు నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. సికింద్రాబాద్‌లో డిసెంబరు 1న నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, మాజీ ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎగువ మానేరులో యువకుడి గల్లంతు

గంభీరావుపేట నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు జలాశయంలో దూకి ఓ యువకుడు గల్లంతయ్యాడు. కామా రెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం వేల్పు గొండ గ్రామానికి చెందిన యువ కుడు ఎగువ మానేరులో దూకినట్టు భావి స్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైతులకు అందుబాటులో ఉంటా

కోనరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. మండలంలోని సుద్దాలలో మంగళవారం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎల్లయ్యను ఘనంగా సన్మానించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



బహుమతులు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్

సిరిసిల్ల రూరల్, నవంబరు 26: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, పెద్దబోనాల, ముష్టిపల్లి, పెద్దూర్, సర్దాపూర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు కౌన్సిలర్లు, నాయులు పూల మాలలు వేశారు. కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మీశంకరయ్య, బోల్గం నాగరాజుగౌడ్, చెన్నమనేని కీర్తి కమలాకర్‌రావు, లింగంపల్లి సత్య నారాయణ, కో ఆప్షన్ సభ్యుడు గొల్లపల్లి బాలయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బుర్ర మల్లికార్జున్‌గౌడ్, టీఆర్ఎస్ నాయకుడు రమణారావు, కాంగ్రెస్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందితో కమాండెంట్ శ్రీనివాసరావు ప్రతిజ్ఞ చేయించారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. నామాపూర్, పోతుగల్ తదితర గ్రామాల్లో రాజ్యాంగ దినోత్సావాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సంఘం నాయకులు జంగం భూమరాజు, శాడల లక్ష్మణ్, జంగ బాబు పాల్గొన్నారు.

మద్దికుంట, బందనకల్ ప్రభుత్వ పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు. హెచ్ఎం బాపురెడ్డి పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీస్, సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఏజీపీ కళ్యాణ్ చక్రవర్తి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బారత రాజ్యంగ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు.

వీర్నపల్లి: వీర్లపల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంతోపాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రాజ్యాంగం విశిష్టతను, రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు.

వేములవాడ: భారత రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్, ఎన్‌వైకేఎస్ జిల్లా అధికారి రాంబాబు పాల్గొన్నారు.

● వేములవాడ పట్టణంలో బీజేపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ నాయకులు రేగుల మల్లికార్జున్, పిన్నింటి హన్మాండ్లు, రేగుల రాజ్ కుమార్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి



నివాళులు అర్పిస్తున్న ప్రతాప రామకృష్ణ

ప్రజాపాలనపై సర్వత్రా హర్షం

తంగళ్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని, ప్రజలు సంతోషంగా ఉన్నారని మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ఈజీఎస్ నిధులతో పశువుల కొట్టం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉత్తమ ఉపాధి కూలీ, మల్టీ పర్పస్ వర్కర్, వన సేవకుడిని సన్మానించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠిక చదివి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. డీఆర్‌డీవో శేషాద్రి, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా..

కోనరావుపేట, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాని, మంగళపల్లివాసుల చిరకాలవాంఛ నెరవేర్చానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళపల్లి, కొలనూరు, మల్కపేట గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. అనంతరం మల్కపేట రామాలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కోనరావుపేట మండలం మంగళపల్లి గ్రామంలో కోటి 30 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి, 1 కోటి 90 లక్షలతో కొలనూరు, రామన్నపేట మధ్య రోడ్డు బ్రిడ్జి నిర్మాణానికి, మల్కపేట గ్రామంలో రామాలయానికి రూ.90 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణనికి శంకుస్థాపన చేశారు. మంగళపల్లి గ్రామ ప్రజల చిరకాల కోరిక నేడు నెరవేరిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దేశానికి తెలంగాణ రాష్ట్రం ఒక రోల్ మోడల్‌గా ఉండేలా రైతు రుణమాఫీ గుర్తు చేశారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ పేరిట పావలా పావలా చేసిందని, రైతులకు చేసిందేమీ లేదని ఆరోపించారు. మొన్నటి రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో ఒక రోజంతా ప్రభుత్వం వేములవాడలోనే ఉందన్నారు. త్వరలోనే మల్కపేట రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేసి నీటితో నింపుతామన్నారు. మీకు ఏ సమస్య వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ప్రజాప్రతినిధులు తాళ్లపల్లి ప్రభాకర్, నందు గౌడ్, బాదినేని బాలరాజు, గొట్టే రుక్మిణి, బి దేవయ్య, అవురం సురేష్, నాయిని ప్రభాకర్ రెడ్డి, బి శేఖర్, నీరెడ్డి సంజీవ్, సుంకరి రెడ్డి, మానక సత్యం, పెంతల శ్రీనివాస్, లింబయ్య, అధికారులు పాల్గొన్నారు.



ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

యాసంగి ప్రణాళిక ఖరారు

(5వ పేజీ తరువాయి)

ప్రవహించడంతో మిడ్ మానేరుకు జలకళ వచ్చింది. జిల్లాలోని ఎగువ మానేరు, నిమ్మపల్లి ప్రాజెక్ట్, అనంతారం ప్రాజెక్ట్‌లతోపాటు భారీ చెరు వు లు, కుంటలు జలకళతో ఉట్టిపడుతున్నాయి. మిడ్ మానేరులో 27.58 టీఎంసీల సామర్థ్యానికి 26.56 టీఎంసీల నీరు ఉంది. దీంతో వేములవాడ మూలవాగు, సిరిసిల్ల మానేరు వాగు బ్యాక్ వాటర్‌తో కళకళలాడుతోంది. యాసంగిలో రైతులు పండించే పంటలకు ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే అధికంగానే వర్షాలు పడ్డాయి. నవం బరు వరకు సాధారణ వర్షపాతం 829.6 మిల్లీమీటర్లకు 966. మిల్లీమీటర్ల వర్షం కురసింది. దీంతో యాసంగి సాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు భరోసాగా ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త కలెక్టర్ రూపంలో కూర్చున్నాడు..

(5వ పేజీ తరువాయి)

వారికి వడ్డీతో సహా ఇస్తామన్నారు. చిట్టినాయుడుని చూసి ఎగిరి ఎగిరి పడుతున్నా జిల్లా కాంగ్రెస్ సన్నాసులు ఉన్నారని, ఎన్నికల్లో తన మీద గెలవలేదని అన్నారు. ప్రజలు ఛీ కోడుతున్నా ప్రభుత్వం ఉందని అధికారులను అడ్డంపెటుకొని ఊరేగుతున్నా సన్నాసులని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వచ్చినపుడు మంచి మాటలు చెబుతాడని అనుకున్నాం. ఎక్కడ పోయినా చివరకు బాలల దినోత్సవం, రాజీవ్ సద్భావన యాత్రలో కేసీఆర్‌ను తిట్టుడేనని చివరకు ముఖ్యమంత్రి బర్త్‌డేకు యాదగిరిగుట్టకు పోయినా కేసీఆర్‌ను తిట్టాడని అన్నారు.

29న దీక్షా దివస్.. డిసెంబరు 9న విజయదివస్

నవంబరు 29ని దీక్షా దివస్‌గా డిసెంబరు 9ను విజయదివస్‌గా జరుపుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కరీంనగర్, సిరిసిల్ల, హైదరాబాద్‌లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాను పాల్గొంటానని తెలిపారు. నవంబరు 29న దీక్ష దివస్ వద్ద ఇప్పటి తరాలకు తెలంగాణ ఉద్యమం తెలిపే విధంగా 25 నిమిషాల నిడివిగల డాక్యుమెంటరీని ప్రదర్శిస్తామని అన్నారు. జిల్లా కేంద్రంలో 29న తెలంగాణ తల్లి విగ్రహాని పూలమాలలు వేసి అమరవీరుల స్థూపాల వద్ద నివాళులు తెలిపి జిల్లా కార్యాలయాల వద్ద దీక్ష దివస్ నిర్వహించాలన్నారు. డిసెంబరు 9 గ్రామ గ్రామాన తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జగిత్యాల మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళచక్రపాణి, రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ అకునూరి శంకరయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, సత్తార్, నర్సయ్య, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

● అంబేద్కర్ అందించిన రాజ్యాంగం స్ఫూర్తితో పోరాటం, రాజ్యాంగంలో ఆర్టికల్ 3 నిబంధన ఆధారంగానే తెలంగాణకు సాధించుకున్నామని కేటీఆర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఉన్నంతకాలం అంబేద్కర్‌కు రుణపడి ఉంటామన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని నాగుల ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సంపత్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

హక్కులను హరించారు

సిరిసిల్ల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి అన్ని ఫలాలను అనుభవిస్తూ మాదిగ మాదిగ ఉపకులాల హక్కులను హరించారని తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే మొట్ట మొదట ఎస్సీ వర్గీకరణను తెలంగాణలో అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటిచ్చారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకం కాదంటూనే స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాల కాలంలో మాల మాలల ఉపకులాల వారు అన్ని ఫలాలను అనుభవించారన్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరు ముగ్గురు ప్రజా ప్రతినిధులుగా ఎదిగి కోట్ల రూపాయలు సంపాదించారని, ఎస్సీ వర్గీకరణనకు వ్యతిరేకంగా ఈ రాష్ట్రంలో నాయకత్వం వహిస్తున్నారని ఆరోపించారు. మాదిగల సపోర్టు లేకుండానే ప్రజాప్రతినిధులుగా ఎదిగారా? భవిష్యత్‌లో మాదిగల ఓట్లు వద్దా? అని ప్రశ్నించారు. మాదిగల ఓట్లు వద్దు అంటే రాజీనామా చేసి మళ్లీ పోటీచేయాలన్నారు. వీటిపై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ వేదికపైన దళితులను చైతన్య పరిచిన నాయకుడు కళాకారుడు రాజేష్ మందకృష్ణ మాదిగపై వాడే పదజాలలు బాగులేవని, మార్చుకోవాలని సూచించారు. రెచ్చగొట్టె ప్రసంగాలు చేయవద్దని తమవద్ద కూడా కళాకారులు ఉన్నారని మీరు ఒక్కమాట అంటే వంద మాటాలు అనే శక్తి తమకు ఉందని అన్నారు. సమావేశంలో నాయకులు రుద్రారం రామచంద్రం, అవునూరి ప్రభాకర్, ఖానాపురం లక్ష్మన్, మంగలి చంద్రమౌళి, రాగేటి దేవదాస్, నేదురి లక్ష్మన్, కొట్టెపల్లి సుదాకర్, ఎడ్ల నరేష్, కాసుపాక రాములు, వడ్లూరి తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులు న్యూనతా భావాన్ని వీడాలి

చందుర్తి నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు న్యూనతా భావాన్ని వీడాలని జిల్లా మానసిక వైద్యనిపుడు ప్రవీణ్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మానసిక ఒత్తిడిపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులు సమస్య ఎదురైనప్పుడు ధైర్యంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో పంచుకోవాలని అన్నారు. సరైన సలహా, మార్గనిర్దేశనం మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు.

ప్రత్యేక అధికారిని సస్పెండ్ చేయాలి

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ప్రత్యేక అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండలం కొళ్లమద్ది గ్రామ మాజీ సర్పంచ్, కాంట్రాక్టర్ కేశవరావును మంగళవారం తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడితోపాటు పలువురు జేఏసీ నేతలు కలిసారు. సోమవారం కొళ్లమద్ది మాజీ సర్పంచ్ కేశవరావు గంభీరావుపేటలో తనకు రావల్సిన పెండింగ్ బిల్లుల కోసం పత్తిమందు డబ్బాతో నిరసన తెలిపాడు. ఈ క్రమంలో కేశవరావుకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేశవరావుకు రావల్సిన బిల్లుల అంశంలో ప్రత్యేక అధికారితోపాటు ఈవో నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమని ఆరోపించారు. గ్రామ పంచాయతీలో జనరల్ ఫండ్ ఖాతాలో డబ్బులు ఉన్నా బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెట్టిన ప్రత్యేక అధికారిపై తక్షణమే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక అధికారి వైఖరిని మాజీ సర్పంచుల జేఏసీ పక్షాన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కార్యదర్శి గున్నాల లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శులు గండ్ల సుమతి, తాడెపు ఎల్లం, సలహాదారులు చాకలి రమేష్, కార్యవర్గ సభ్యులు చిట్నేని శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.



సంఘీబావం తెలుపుతున్న కరుణాకర్, తదితరులు

బాధ్యులపై హత్య కేసు నమోదు చేయాలి

వేములవాడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువుల కోసం గురుకుల పాఠశాలలో చేరిన శైలజ కలుషిత ఆహారం తిని మృత్యువుతో పోరాడి చనిపోయిన సంఘటనలో బాధ్యులపై హత్య కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ నాయకుడు పోతు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. కొమురం భీం అసిఫాబాద్ జిల్లా వాంకిడి గురుకుల పాఠశాలకు చెందిన శైలజ అనే విద్యార్థిని మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ మంగళవారం సాయంత్రం వేములవాడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో పరిపాలన అస్తవ్యస్తంగా ఉండటమే కాకుండా కలుషిత ఆహారంతో నిరుపేద బిడ్డల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తుమ్మల దిలీప్, సాయి, శివ, సందీప్, ఉమర్, పర్వేజ్, రఫీ, వెంకటేష్, రాకేష్, సంతోశ్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అంకితభావంతో పనిచేయాలి

చందుర్తి, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని బదిలీపై వెళ్లిన ఎంఈవో శ్రీనివాస దీక్షితులు అన్నారు. చందుర్తి, రుద్రంగి మండలాలకు మండల విద్యాధికారిగా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగళవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పనిచేసే వారికి ఎక్కడికి వెళ్లినా గుర్తింపు లభిస్తుందన్నారు. అన్ని పాఠశాలలు అభివృద్ధి చెందినప్పుడే మండలానికి మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చందుర్తి, రుద్రంగి మండలాల విద్యాదికారులు వినయ్‌కుమార్, రామకృష్ణ, చందుర్తి, రుద్రంగి మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకోవాలని ముస్తాబాద్ తహసీల్దార్ సురేశ్ అన్నారు. మండల కేంద్రంలోని మద్దికుంట ఎల్లయ్య అనే రైతుకు మంజూరైన పశువుల పాకను మంగళవారం ప్రారంభించారు. 'మా ఊరి పనుల జాతర'లో భాగంగా మండలంలో దాదాపు 20 మంది రైతులకు పశువుల పాకలు మంజూరయ్యాయన్నారు. ఎంపీడీవో బీరయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సయ్య, ఏఈ ఇనాయుతుల్లా, ఏపీవో ఆనంద్ మోహన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో అధికారులు ప్రజాపాలన విజయోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వన సంరక్షకులకు ఈజీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ప్రజా పాలన విజయోత్సవాల్లో మన ఊరిలో పనుల జాతర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండలంలోని సముద్రలింగాపూర్, దమ్మన్నపేటలో ఉపాధి కూలీలను సన్మానించారు. ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, ఏపీవో అరుణ, కార్యదర్శి లక్ష్మి తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి : వీర్లపల్లి మండలంలోని రంగంపేట, అడవిపదిర, బాబాయ్ చెరువు తండాతో పాటు ఆయా గ్రామాలలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఉపాధి పనుల జాతరను చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లకావత్ రాములు నాయక్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం యాదవ్, వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్ యాదవ్ భూమిపూజ చేశారు. ఏపీవో శ్రీహరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న తహసీల్దార్ సురేశ్

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సాధికారత కేం ద్రం కో-ఆర్డినేటర్ రోజా కోరారు. స్త్రీలపై హింసకు వ్యతి రేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోనిజిల్లా మహిళా సమాఖ్యలో సదస్సు నిర్వహించారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. డీపీఎం పద్మఅయ్యార్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత , సఖికేంద్ర కౌన్సిలర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కో- ఆర్డినేటర్ రోజా

పవర్‌లూం కుటీర పరిశ్రమను ఆదుకోవాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు అనుబంధంగా కొనసాగుతున్న పవరల్‌లూం కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని, వస్త్రాల తయారీ అర్డర్‌లను అందించి ఆదు కోవాలని కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం నాయకులు గౌడ వాసు, కొండ ప్రతాప్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని నేతన్న చౌరస్తాలో మంగళవారం కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి సంఘాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం లో సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యలపై ఆ నాటి ప్రజారాజ్యాం పార్టీ అధినేత చిరంజీవి సిరిసిల్లకు వచ్చిన రోజున కుటీర పరిశ్రమలకు ఉన్న రేకులషెడ్‌లు ఉన్నాయని, 15 ఏళ్లకు కూడా అవే కుటీర పరిశ్రమలకు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం కుటీర పరిశ్రమలను గుర్తించలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వస్త్ర పరిశ్ర మలతో పాటు కుటీర పవర్‌లూంలను గుర్తించాలని కోరారు. కుటీర పవర్‌లూం వస్త్ర ఉత్పత్తి దారుల సంఘం నాయకులు రమేష్, శంకర్, సుంచు ప్రకాష్, మధు, రమేష్, జలేందర్, లక్ష్మీనారాయణ, రాజేశం, భాస్కర్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా కార్మిక, రైతు, ప్రజా అనుకూల విధానాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అకుల రాములు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం సీఐటీయూ. ఐఎఫ్‌టీయూ, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కేంద్రంలోని బీజేపీ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోం దన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికులను బానిసత్వంలోకి నెట్టివేస్తోం దన్నారు. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్, ఐఎఫ్‌టీయూ నాయకులు పర్శరాములు, మల్లయ్య. సైజింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిషోర్, రాము, సీఐటీయూ నాయకులు అన్నల్‌దాస్ గణేష్, రాజశేఖర్, శ్రీధర్, పద్మ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అర్హులై ఉండి డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని 850 మందికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో అర్హులై డ్రా పద్ధతిన డబుల్ బెడ్‌రూం ఇల్లు రాని మహిళలు ధర్నా చేపట్టారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డ్రా పద్ధతి తీసుకొచ్చి పేదలను మోసం చేసిందని, సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టామని తెలిపారు. దీంతో కేటీఆర్ ఆధ్వర్యంలో నాటి కలెక్టర్ అర్హులైన 44 మందికి పట్టాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలకు కూడా డబ్బులు ఇస్తామన్నారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలతున్నా ఇప్పటికి పరిష్కారం చూప లేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్‌కుమార్, పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు, నాయకులు